జామ్ జామ్

ట్రాఫిక్ రద్దీ.. నియంత్రించాలి జల్దీ

- నిజాంపేట్‌కార్పొరేషన్‌లో తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య
- పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించడం లేదంటున్న వాహనదారులు
- ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్


ప్రగతినగర్‌లో ట్రాఫిక్ జామ్

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. ఇంతటి సమస్యను పరిష్కారించడంలో ట్రాఫిక్ పోలీసులు ఎందుకు విఫలమవుతున్నారని వాహనదారులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు.వాహనదారులు ఇంటి నుంచి బయటకు వచ్చి తమ గమ్య స్థానాలకు సమయానికి చేరడం కష్టమవుతోంది. ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి ప్రధాన సర్కిళ్ల వద్ద సిగ్నల్స్ దాటడానికి చాలా సమయం పడుతోంది. జేఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ మీదుగా గండి మైసమ్మ బాచుపల్లి, భౌరంపేట్, మేడ్చల్, ఓఆర్‌ఆర్ వైపు వెళ్లడానికి వాహనదారులు ప్రగతినగర్ మీదుగా ప్రయాణం చేస్తుంటారు.దీంతో వాహనాల రద్దీ సైతం సహజంగా ఎక్కువైంది.దీనికి అనుగుణంగా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణలో పని చేయాల్సిందిపోయి సమస్యను గాలికోదిలేశారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రగతినగర్‌లో...

జేఎన్‌టీయూవైపు నుంచి ప్రగతినగర్‌కు వాహనాలు ప్రవేశించిన తర్వాతప్రగతినగర్ కమాన్ అంబేడ్కర్ సర్కిల్ వరకు ఎక్కడ ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు దరిదాపుల్లో కనిపించరు.దీంతో ఎక్కడ పడితే అక్కడ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ముఖ్యంగా శ్రీ మంకీస్ సెంటర్, మోర్ సూపర్ మార్కెట్ సర్కిల్,ఇస్కాయిస్ కాకతీయ హిల్స్ సర్కిల్,ఎలీప్ సర్కిల్‌లలో ట్రాఫిక్ జామ్ ఉదయం ,సాయంత్రం సమయాల్లో తీవ్రంగా ఉంటుంది.ఏ ఒక్క రోజు కూడా ఇక్కడ పోలీసులు ట్రాఫిక్ నియంత్రించిన సందర్భాలు లేవని వాహనదారులు పేర్కొంటున్నారు.కేవలం ప్రగతినగర్ కమాన్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద మాత్రమే సిగ్నల్స్ ఉన్నాయి.కాని ఇక్కడ కూడా సమయానికి పోలీసులు ట్రాఫిక్ నియంత్రించలేకపోతున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిజాంపేట్‌లో...

ఇక నిజాంపేట్‌లో సైతం ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు అందుబాటులో లేకపోవడంతో సమస్య రోజు రోజుకు తీవ్రమై తమ విలువైన సమయం వృథా అవుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా నిజాంపేట్ బస్టాండ్ నుంచి బవ్యాస్ ఆనందం అపార్ట్‌మెంట్ వరకు ఈ సమస్య ప్రతి రోజు ఉంటుందన్నారు.అదే విధంగా నాగార్జున హోమ్స్, హోలిస్టిక్ ఆసుపత్రి ముందు ట్రాఫిక్ జామ్ఎక్కువగా ఉంటోంది.ప్రతి రోజు విధులు నిర్వహించే పోలీసులకు ఈ సమస్యను ఎందుకు గుర్తించలేకపోతున్నారని వాహనదారులు ,ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

బాచుపల్లిలో...

ఇక బాచుపల్లిలో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా ఉంటోంది.నిజాంపేట్ వైపు నుంచి రాజీవ్ గాంధీనగర్ మీదుగా బాచుపల్లి సిగ్నల్స్ నుంచి ఇటు బొల్లారం, మియాపూర్, మేడ్చల్,ఓఆర్‌ఆర్ వైపు వాహనదారులు ప్రయాణం చేస్తుంటారు.ఉదయం ఒక్కసారిగా స్కూల్స్, కాలేజీలు,కంపెనీలకు వెళ్లే వాహనాలతో రద్దీ ఎక్కువగా ఉంటోంది.అదే విధంగా గండిమైసమ్మ చౌరస్తా నుంచి మియాపూర్ వైపు వెళ్లే వాహనాలు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకోవాల్సిందే.ఇక్కడ సిగ్నల్ దగ్గర పోలీసులు ఉన్నప్పటికీ ట్రాఫిక్‌ను అవసరమైన విధంగా మళ్లింపు చేపడితే సమస్య తీవ్రత తగ్గుముఖం పడుతుంది.

◆ నిజాంపేట్ మీదుగా మియాపూర్ వైపు వెళ్లే వాహనాలను రాజీవ్ గాంధీనగర్ దాటగానే కౌసల్య కాలనీ మీదుగా సూచిక బోర్డు ఏర్పాటు చేస్తే వాహనాల మళ్లింపు జరుగుతుంది.అదే విధంగా గండిమైసమ్మ చౌరస్తా నుంచి వచ్చే వాహనాలను నిజాంపేట్ వైపు వెళ్లేందుకు బాచుపల్లి పోలీస్‌స్టేషన్ మీదుగా బాచుపల్లి గ్రామంలో నుంచి చిన్న వాహనాలను మళ్లించే ఏర్పాటు చేయవచ్చు.గండిమైసమ్మ వైపు నుంచి బొల్లరం వైపు వేళ్లే వాహనాలను సిగ్నల్స్‌కు ముందే కేసీఆర్‌కాలనీ మీదుగా కూడా వాహనాలను మళ్లింపు చేయవచ్చు.

టైమ్ వేస్ట్ ఐతుంది..



నేను ప్రతి రోజు రాయదుర్గం నుంచి ప్రగతినగర్ సమీపంలో ఉన్న వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజినీరింగ్ కాలేజీకి ఆర్టీసీ బస్సులోవస్తాను. బాచుపల్లి సమీపంలోకి రాగానే బస్సు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతోంది. ప్రతి రోజు ట్రాఫిక్‌తో టైమ్ వేస్ట్ ఐతుంది. టైమ్‌కి కాలేజీకి వెళ్లేలేకపోతున్నా.

– తన్విత, విద్యార్థి

ట్రాఫిక్‌సమస్యను పరిష్కరించాలి



నేను సికింద్రబాద్ నుంచి వీఎన్ఆర్ కాలేజీకి వస్తాను.జేఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ వరకు బాగానే ఉన్నా ప్రగతినగర్ నుంచి కాలేజీకి వెళ్లే సరికి చాలా టైమ్ పడుతుంది. ట్రాఫిక్ పోలీసులు ఈసమస్యను పరిష్కారించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– శ్రావణి, విద్యార్థి

కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తా


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ఔట్ సోర్సింగ్ కార్మికులు

దుండిగల్: కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ జలమండలి ఔట్ సోర్సింగ్ కార్మికులు మంగళవారం శంభీపూర్ రాజుని కలిసి తమ సమస్యలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 14ను అమలు చేయాలన్నారు. కార్మికులకు గత 15 సంవత్సరాల నుంచి వేతనం పెంచడం లేదని తెలిపారు. నెలకు రూ.11వేల జీతంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన రాజు జలమండలి బోర్డు అధికారులతో చర్చించడంతో పాటు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు న్యాయం చేసే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

◆ కుత్బుల్లాపూర్ సర్కిల్ బాపూనగర్ సంక్షేమ సంఘం సభ్యులు శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సోమేష్ యాదవ్, సంక్షేమ సంఘం ప్రతినిధులు జగదీశ్‌గౌడ్, కృష్ణాయాదవ్, జైపాల్‌రెడ్డి, బెనర్జీ, శ్రీనివాస్, శివ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి


సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి

కుత్బుల్లాపూర్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పాలనలో ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. కొంపల్లిలో మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భైరి ప్రశాంత్‌గౌడ్, నియోజకవర్గ హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఇన్‌చార్జ్ రంగినేని అభిలాష్‌రావు ఆధ్వర్యంలో యాత్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల పాలనలో నిత్యవసరాల ధరలు ఆకాశాన్నంటాయని అన్నారు. సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. అధిష్టానం అందరికి తగు విధంగా ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోత్స్న శివారెడ్డి, కొలన్ హన్మంతరెడ్డి, సీనియర్ నాయకులు యతిరాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ ఏ- బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈ చౌరస్తాలో ఆటో వాళ్లదే రాజ్యం


గాజులరామారం వెళ్లే షాపూర్‌నగర్ చౌరస్తాలో ఫ్రీ లెఫ్ట్‌లో ట్రాఫిక్ జామ్

కుత్బుల్లాపూర్: ఆ చౌరస్తా ఆటో వాళ్లదే హవా... నిత్యం రద్దీగా ఉండే ఆ మూలమలుపు వద్ద ఆటోలు నిలిపి ఇదేమని ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతారు. ఒకరితో గొడవ పడితే పదిమంది జత కడతారు. ఇంకేముంది బెదిరింపులు చేసి ఎదురు తిరిగిన వారికి వార్నింగ్ ఇచ్చేలా దౌర్జన్యం చేస్తూ వస్తున్నారు . ఇంతకీ ఇక్కడ విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీస్ పక్కనే ఉన్న హోటల్ సమీపంలో చెట్టు కింద నిలబడి తనకు విధించిన టార్గెట్‌ను (చలాన్ రూపంలో) పూర్తి చేసే పనిలో ఉంటాడు. ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఎదురైనా ఏదైనా గొడవ జరిగినా పట్టించుకోరు. దీంతో షాపూర్‌నగర్ ఉషోదయ టవర్ ముందు ఉన్న చౌరస్తా ట్రాఫిక్ సమస్య ఎదురవుతూ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు జీడిమెట్ల పారిశ్రామిక వాడ మరోవైపు నర్సాపూర్ రాష్ట్ర రహదారి ఇలా రెండు వైపుల వేలాది వాహనాలు నిత్యం తిరుగుతూ ఉంటాయి. ఈ చౌరస్తాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ పోలీసులు ఉండాలి. కానీ వారి జాడ కనిపించదు. గాజులరామారం వెళ్లాలంటే ఈ చౌరస్తాలో ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేశారు. అయితే ఆ మూలమలుపు వద్ద ఆటో లు పార్కు చేసి ప్రయాణికులను ఎక్కించుకుంటారు. ఎవరైనా రోడ్డు మీద నిలబడ్డ ఆటో డ్రైవర్ను ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారు. ఇక్కడ ట్రాఫిక్ ను నియంత్రించాల్సిన పోలీసులు కనిపించకపోవడం నిత్యం గొడవలు జరుగుతున్నాయి. ఉదయం సాయంత్రం వేళల్లో ఇక్కడ ట్రాఫిక్ సిబ్బందిని నియమించి ఆటో వాళ్లను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళ అదృశ్యం


జయమ్మ (ఫైల్)

కుత్బుల్లాపూర్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచమ్మగడ్డకు చెందిన ముత్యపాగ లావణ్య, ఆమె బావ అనిల్‌ల మధ్య ఇంటి విషయమై కొన్ని రోజులుగా గొడవ జరుగుతోంది. మంగళవారం ఉదయం మరోసారి ఇరువురు గొడవకు దిగారు. ఈ నేపథ్యంలో లావణ్య అత్త జయమ్మ(56) మధ్యలో కలుగ చేసుకుని గొడవ పడొద్దని సర్ది చెప్పింది. మా మధ్య నువ్వేందుకు వస్తున్నావంటూ ఆమెను దుర్భాషలాడారు. దీంతో మనస్తాపానికి గురైన జయమ్మ ఇంట్లో చెప్పాపెట్టకుండా వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కల పట్టివేత



దుండిగల్: మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల పట్టివేత కార్యక్రమం కొనసాగుతోంది. దుండిగల్ మున్సిపల్ మల్లంపేటలోని 21,2, 25 వార్డుల్లో మంగళవారం మున్సిపల్ సిబ్బంది వీధి కుక్కలను పట్టుకుని బ్లూక్రాస్ సొసైటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుత ఎండాకాలంలో వీధి కుక్కలు డీహైడ్రేషన్‌కు గురవుతున్నాయని, వాటి నుంచి ప్రజలు, చిన్న పిల్లలను కాపాడేందుకు నివారణ చర్యలు చేపట్టామన్నారు. కుక్కలకు పిల్లలు పుట్టకుండా కు.ని ఆపరేషన్లు చేసి, యాంటి రేబిస్ టీకాలను వేస్తున్నామన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

సుభాష్‌నగర్: మైనార్టీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. మంగళవారం కళావతినగర్‌లో జరిగిన కార్యక్రమంలో ముస్లిం మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన రంజాన్ తోఫాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మైనార్టీలకు అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని కోరారు.

◆ అదే విధంగా కల్యాణలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం తరపున చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు హేమలతరెడ్డి, లావణ్య, లక్ష్మణ్, రఘు తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

రేపు రుణ దరఖాస్తుదారులకు వెరిఫికేషన్

కుత్బుల్లాపూర్: షాపూర్‌నగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మైనార్టీలకు రుణాల విషయమై బ్యాంక్ అధికారులతో ఈనెల 13న జాయింట్ వెరిఫికేషన్ ఉంటుందని ప్రాజెక్ట్ అధికారి హరిప్రియ ఓ ప్రకటనలో తెలియజేశారు. గాజుల రామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వెరిఫికేషన్ కొనసాగుతుందన్నారు. దరఖాస్తుదారులు తమ వెంట దరఖాస్తు ఫారం, ఆధార్‌కార్డు, ఓటర్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, ఒక కలర్ ఫొటో, దివ్యాంగులైతే సదర్ సర్టిఫికెట్, ఇన్‌కమ్‌టాక్స్ సర్టిఫికెట్‌లు ఒరిజినల్స్‌తో పాటు జిరాక్స్‌లు తీసుకురావాలని కోరారు. జిల్లా మైనారిటీ అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారులు వెరిఫికేషన్‌లో పాల్గొంటారని ఆమె తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం కిటకిట


58 జీవో పట్టాల కోసం క్యూలైన్‌లో నిలుచున్న మహిళలు

సుభాష్‌నగర్: ప్రభుత్వ ఆక్రమిత స్థలాల్లో 2020 జూన్ వరకు ఉన్న వారికి ప్రభుత్వం మరో మారు అవకాశం ఇవ్వగా ఓవైపు మీ సేవలో దరఖాస్తు చేసుకుంటున్నారు. మరోవైపు గత సంవత్సరం 58 జీవో కింద దరఖాస్తు పెట్టుకున్న వారికి పట్టాలు రాగా, వారికి అధికారులు ఫోన్‌లు చేయడంతో వాటిని తీసుకోవడానికి కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి ప్రతిరోజు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. దీంతో కార్యాలయం సందడిగా మారింది. చాలా వరకు రెవెన్యూ శాఖ నుంచి ఫోన్లు రానివారే అధిక సంఖ్యలో వస్తుండడంతో వారికి సర్ది చెప్పలేక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

నేటి నుంచి ఉచిత అంబులెన్స్ సేవలు

చింతల్: భగత్‌సింగ్‌నగర్ వాసుల సౌకర్యార్థం గర్భిణుల కోసం ఉచిత అంబులెన్స్ సేవలను బుధవారం ప్రారంభించనున్నట్లు భగత్‌సింగ్‌నగర్ సీనియర్ నాయకుడు అల్లా బకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు నాలుగు లక్షల రూపాయలు వెచ్చించి తన కుటుంబ సభ్యుల సహకారంతో ఈ అంబులెన్స్‌ను భగత్‌సింగ్‌నగర్ వాసులు, గర్భిణు మహిళల సౌకర్యార్థం సమకూర్చినట్లు పేర్కొన్నారు. గతంలో భగత్ సింగ్‌నగర్ వాసులకు తాను చేసిన వాగ్దానంలో భాగంగా తన సొంత ఖర్చులతోఈ అంబులెన్స్‌ను పేద ప్రజలకు అంకితం చేస్తున్నానని ×సాక్షి×కి ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కె.ఎం.ప్రతాప్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. భగత్ సింగ్‌నగర్ వాసులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

'బస్తీబస్తీకి ఓబీసీ.. ఇంటింటికీ బీజేపీ'


జయరామ్‌నగర్‌లో కరపత్రాలు అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్: ఓబీసీల అభ్యున్నతికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు పరుస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. బస్తీబస్తీకి ఓబీసీ–ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జీడిమెట్ల డివిజన్‌లో జయరామ్‌నగర్‌లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు బలరామ్, ప్రధాన కార్యదర్శి వీరేశం, భవర్‌లాల్ చౌదరి, అంజయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

దుండిగల్: బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తోందని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధి శంభీపూర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి పరిక్షలు నిర్వహించిన అనంతరం ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు రఘుపతి, అంజయ్య, జవాన్ పెంటయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, కార్పొరేటర్లు

నేటి తరానికి జ్యోతిబాపూలే ఆదర్శం

మహాత్మా జ్యోతిబాపూలే జయంతి మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఘనంగా జరిగింది. ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పూలే చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిబాపూలే గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. అణగారిన వర్గాలకు అండగా ఉంటూ వారి గెలుపు కోసం ఆయన ఎన్నో త్యాగాలు చేశారన్నారు. మహిళల హక్కుల కోసం, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పాటు పడిన మహనీయుడని కొనియాడారు. నేటి తరానికి పూలే ఆదర్శప్రాయుడని.. ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. – కుత్బుల్లాపూర్


నిజాంపేట్‌లో మేయర్ కొలన్ నీలారెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పిస్తూ..


షాపూర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్


జయంతి వేడుకల్లో షాపూర్‌నగర్‌లో నియోజకవర్గ సీపీఐ నాయకులు


సూరారం అంబేడ్కర్‌నగర్‌లో జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలు


తెలంగాణ కాంగ్రెస్ ఓబీసీ నాయకుడు భరత్ ఆధ్వర్యంలో..


కొంపల్లిలో బీజేపీ నేత ఆదిరెడ్డి రాజిరెడ్డి ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు

అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తా


జైరామ్‌నగర్‌లో ప్రగతియాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్‌ను అభివృద్ధి పథంలో నిలిపేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జైరామ్‌నగర్, రుక్మిణి ఎస్టేట్స్, మహానగర్ కాలనీల్లో మంగళవారం ఆయన ప్రగతియాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ వాటిని పరిష్కరిస్తానని హామీ ఇస్తూ యాత్రను కొనసాగించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... తన హయాంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలు లేని ప్రాంతాల్లో వసతులు కల్పించామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సుకు పాటుపడే పార్టీ కాంగ్రెస్


గుడెన్‌మెట్‌లో కరపత్రాలు పంచుతున్న కొలన్ హన్మంతరెడ్డి

రంగారెడ్డినగర్: ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం ఆయన రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గుడెన్‌మెట్‌లో పర్యటించారు. స్థానికంగా ఉన్న హనుమాన్ ఆలయం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలయ్యాయని అన్నారు. కుటుంబ పాలనతో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించిన అర్హులకు ఇవ్వడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజల సొంతింటి కలను నెరవేర్చడంతో పాటు దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జాయింట్ సెక్రటరీ సువ్వారి శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ అమర్ బాబు, మాజీ వార్డు మెంబర్ శివ కుమార్, శ్రీనివాస్, హమ్మి రెడ్డి, గురువారెడ్డి, శ్యామ్, ప్రవీణ్, నర్సింగ్, భాస్కర్, గణేష్, మహిళా నాయకులు లక్ష్మి, లక్ష్మి రెడ్డి, కౌసల్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అభినందనీయం


మేయర్ నీలారెడ్డి చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేస్తున్న నాగరాజుయాదవ్

నిజాంపేట్: ఆలయ అభివృద్ధికి తోడ్పాటునందించడం అభినందనీయమని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ 12వ డివిజన్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్ రూ.10,116 విరాళాన్ని అందజేశారు. మంగళవారం సదరు మొత్తాన్ని మేయర్ నీలారెడ్డి చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ ఆగం పాండుముదిరాజ్, కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు తలారి వీరేష్, బీఆర్ఎస్ నాయకులు ఆవుల జగదీష్‌యాదవ్, రాము, బైండ్ల నాగేష్, బక్క మల్లేశ్, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్, బట్ట మురళి, ఎల్ఐసి శ్రీనివాస్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.